# నర్సింగపేటలో సీడ్ బాల్స్‌పై అవగాహన కార్యక్రమం

**చింతూరు, పెన్ పవర్, జూన్ 18:** నర్సింగపేట గ్రామంలో పీపుల్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో సీడ్ బాల్స్‌ను వేయడం ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చని తెలిపారు. మట్టిలో విత్తనాలను ఉంచి చిన్న బంతులుగా తయారు చేసి ఖాళీ ప్రదేశాల్లో విసిరివేయడం వల్ల విత్తనాలు చీడపీడల నుంచి రక్షణ పొంది సహజసిద్ధంగా మొక్కలుగా ఎదుగుతాయని వివరించారు. ప్రస్తుతం వాతావరణ మార్పులు మానవ జీవన విధానంపై ప్రతికూల ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విస్తృతంగా చెట్లను పెంచడం ద్వారా జీవ వైవిధ్యం అభివృద్ధి చెందడంతో పాటు వాతావరణ సమతుల్యత నెలకొని సకాలంలో వర్షాలు కురిసి




పంటల దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సిబ్బంది, స్థానిక రైతులు, గ్రామ యువకులు పాల్గొని సీడ్ బాల్స్ తయారీ విధానంపై అవగాహన పొందారు.




# ఘనంగాలి'రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం









- గిరిజనుల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్
- ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి
- ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎస్ .బొజ్జి రెడ్డి

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 18:**
పోలవరం జిల్లా రంపచోడవరం జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ రెండేళ్ల పాలనలో రాష్ట్రం, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రత్యేక ప్రగతి నివేదికను ప్రజలకు అందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎస్. బొజ్జి రెడ్డి, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సభాధ్యక్షులు జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్ మాట్లాడుతూ, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పోలవరం జిల్లాను గిరిజన అభివృద్ధికి ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దే దిశగా కార్యాచరణ కొనసాగుతోందన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో భారతదేశం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం అభివృద్ధి దిశగా గత 12 ఏళ్ల కేంద్ర ప్రభుత్వం పాలన కీలక మైలురాయిగా పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి,సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలు వేగవంతమయ్యాయని తెలిపారు. ఇక్కడి ప్రజల. ఆకాంక్షలు మేరకు పోలవరం జిల్లా ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. పోలవరం జిల్లా అభివృద్ధి కి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందు కోసం రూ.4 వేల కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, తాగునీరు, రహదారులు, గృహ నిర్మాణం, విద్య, ఆరోగ్యం, గిరిజన సంక్షేమానికి సంబంధించిన నిధులు విడుదల చేసి, ఆయా కార్యక్రమాలు అమలవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. పి-4 ద్వారా సమాజంలోని ఆర్థికంగా బలమైన 10 శాతం మంది, అత్యంత వెనుకబడిన 20 శాతం కుటుంబాలకు అండగా నిలిచే సామాజిక భాగస్వామ్య నమూనాను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. మిషన్ పాత్‌హోల్ ఫ్రీ, జలధార, పీఎం జన్మన్, పీఎం ఆవాస్ యోజన, పోలవరం పునరావాసం,స్వర్ణాంధ్ర విజన్--2047 వంటి కార్యక్రమాలు మన జిల్లాలో అభివృద్ధికి కొత్త దిశను చూపుతున్నాయని పేర్కొన్నారు.పోలవరం జిల్లా ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు, గిరిజన ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖ సమన్వయంతో ఫలితాల ఆధారిత పరిపాలన అమలు చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం,గిరిజన సంక్షేమం,విద్య,వైద్యం, గ్రామీణ తాగునీటి సరఫరా, రహదారులు, విద్యుదీకరణ, గృహ నిర్మాణం, పునరావాసం, జీవనోపాధి కల్పన వంటి అన్ని రంగాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు చివరి గిరిజన కుటుంబానికి చేరేలా పారదర్శకంగా, జవాబుదారీతనంతో అధికారులు పనిచేస్తున్నారని, ప్రజల సహకారంతో పోలవరం జిల్లాను సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని కలెక్టర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీషా దేవి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రెండేళ్లలో ఐదేళ్ల అభివృద్ధికి సమానమైన ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతాల ప్రత్యేక అవసరాలను గుర్తించి, దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే అసెంబ్లీ నియోజకవర్గాన్ని జిల్లాగా ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. పోలవరం జిల్లా ఏర్పాటు ద్వారా గిరిజనుల పరిపాలనా అవసరాలు మరింత సమర్థవంతంగా నెరవేరుతున్నాయని, కేంద్రం -- రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గిరిజన సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల విస్తరణకు భారీ ఎత్తున నిధులు కేటాయించ బడుతున్నాయని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎదుర్కొన్న అనేక సమస్యలకు కూటమి ప్రభుత్వం పరిష్కార మార్గం చూపిందని ఎమ్మెల్యే శిరీషా దేవి పేర్కొన్నారు. దీపం పథకం కింద సంవత్సరానికి నాలుగు గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేల ఆర్థిక సహాయం, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్లు ద్వారా రూ.5కే భోజనం వంటి కార్యక్రమాలు ప్రజల జీవనోపాధికి భరోసాగా నిలుస్తున్నాయని చెప్పారు. రంపచోడవరం తర్వాత త్వరలోనే చింతూరులో కూడా అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.మహిళల సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన డ్వాక్రా ఉద్యమం నేడు మహిళలను విజయవంతమైన పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతోందన్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి గ్రాట్యుటీ కల్పించడం, నిరుపేదలకు గృహ నిర్మాణం, అమరావతిని రాష్ట్ర రాజధానిగా చట్టబద్ధతతో అభివృద్ధి చేయడం, ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనకు చేపడుతున్న కార్యక్రమాలు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాదులుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించడం ప్రభుత్వ విద్యా సంస్కరణలకు నిదర్శనమన్నారు. ఇక్కడి ప్రజలకు సంబంధించి వైద్య సేవలు అందించే క్రమంలో పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా, 100 పడకల ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.పోలవరం జిల్లాలో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, గృహ నిర్మాణం, గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పీఎం జన్మన్, పీఎం ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్, వికసిత్ భారత్ వంటి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలకు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర విజన్--2047, పి-4, మిషన్ పాత్‌హోల్ ఫ్రీ, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి కార్యక్రమాలు తోడై జిల్లాలో అభివృద్ధికి కొత్త ఊపు తీసుకొచ్చాయని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా పనిచేస్తున్నారని, గిరిజన ప్రాంతాలను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.పోలవరం జిల్లా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్తులో శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన జరిగే సందర్భంలో చింతూరు ప్రాంతంలో మరో శాసనసభ నియోజకవర్గం ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపారు. విశాలమైన భౌగోళిక విస్తీర్ణం, గిరిజన జనాభా అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలకు పరిపాలనా సేవలు మరింత చేరువయ్యేలా ఈ ప్రతిపాదన ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, మెరుగైన ప్రజాప్రాతినిధ్యం, ప్రభుత్వ సేవల సమర్థవంతమైన అమలుకు అవసరమైన అన్ని అంశాలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని ఆమె వెల్లడించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎస్. బొజ్జి రెడ్డి మాట్లాడుతూ, గిరిజన సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యాచరణలో ప్రధాన లక్ష్యమని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, తల్లికి వందనం ద్వారా పేద కుటుంబాల పిల్లలు విద్యకు మరింత చేరువయ్యారని పేర్కొన్నారు. స్త్రీ శక్తి వంటి కార్యక్రమాలు మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడుతున్నాయని, పీఎం జన్మన్ కింద గృహ నిర్మాణాలకు ఉచిత ఇసుక సరఫరా చేయడం వల్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి గిరిజన గ్రామానికి సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మరింత విస్తృతంగా కార్యక్రమాలు అమలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. కేంద్రం--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పోలవరం జిల్లాను గిరిజన అభివృద్ధికి ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం కేవలం ప్రభుత్వ విజయాలను వివరించే వేదిక మాత్రమే కాదని, భవిష్యత్ అభివృద్ధి కార్యాచరణకు దిశానిర్దేశం చేసే ప్రజా వేదిక అని అన్నారు. పోలవరం జిల్లాలో ముఖ్యంగా పీవీటీజీ గ్రామాల సమగ్ర అభివృద్ధి, గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాల మెరుగుదల, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వివిధ శాఖల సమన్వయంతో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రతి అర్హులైన కుటుంబానికి ప్రభుత్వ సేవలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల భాగస్వామ్యంతో గిరిజన ప్రాంతాలను సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.కార్యక్రమం లో భాగంగా మత్స్యకారులకు యూనిట్ అందచేత, అంగన్వాడీ పిల్లల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించగా, అన్నదాత సుఖీభవ,తల్లికి వందనం తదితర పథకాల లబ్ధిదారులతో వారి అభిప్రాయాలు వ్యక్తపరిచారు.

ఈ కార్యక్రమంలో రంపచోడవరం రెవిన్యూ డివిజనల్ అధికారి కె. స్వాతి, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్,ఎస్డిపిఓ అశ్రఫ్ అలీ, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె.సునీత ,మైనార్టీ బోర్డ్ సభ్యులు షేక్ సుభాని,పెద్దిరాజు, ఏపీవో జనరల్ డిఎన్వి డిఎం ఎండ్ హెచ్ ఓ సరిత, మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబు రమేష్, వంతల రాజేశ్వరి ,ఎంఎస్ఓ విజయ భాస్కర్,జిసిసి డిఎం జయశ్రీబాబు రమేష్, డిప్యూటీ డైరెక్టర్లు రుక్మండయ, షేక్ మొహమ్మద్ షరీఫ్, జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్, డిఆర్డిఏ పిడి డాక్టర్ దాసరి రత్నాకరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ మోహన్ రావు, ఉమ్మడి ప్రభుత్వ నాయకులు స్వప్న కుమారి, పి శ్రీనివాసరావు, కే రాజశేఖర్ రెడ్డి, శేషు, ఆర్టీవో రాజేష్ కుమార్, డీఈవో శ్రీరామ్ మూర్తి, ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు అన్ని మండలాలకు సంబంధించిన కూటమి పార్టీ అధ్యక్షులు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు .

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనకు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి




**సీతానగరం, పెన్ పవర్, :18జూన్** 2027 గోదావరి మహా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని సీతానగరం మండలంలోని మునికూడలి గ్రామంలోని ఘాట్‌ను పంచాయతీ స్థాయిలో రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మోడల్ ఘాట్‌గా అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ నెల 22న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మునికూడలి ఘాట్‌ను సందర్శించనున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు.పుష్కరాల సమయంలో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఘాట్ అభివృద్ధి పనులను శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భక్తుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక హోల్డింగ్ ఏరియా, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక స్థలాలను గుర్తించినట్లు తెలిపారు.

విశాఖపట్నం వైపు నుంచి వచ్చే భక్తులు కోరుకొండ -- తోర్రేడు మార్గం ద్వారా గోదావరి గట్టు మీదుగా గ్రామంలోకి ప్రవేశించి ఘాట్‌కు చేరుకునేలా, సీతానగరం వైపు నుంచి వచ్చే భక్తులకు మరో ప్రత్యేక మార్గం ద్వారా ఘాట్‌కు చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఘాట్ వద్ద ఒక వైపు నుంచి ప్రవేశం, మరో వైపు నుంచి నిష్క్రమణ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అవసరమైతే రెండు వైపుల నుంచి ప్రవేశ మార్గాలు కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రస్తుతం సుమారు 49 అడుగుల వెడల్పు ఉన్న ఘాట్‌ను దాదాపు 100 అడుగుల వరకు విస్తరించే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. సుమారు 80 మీటర్ల పొడవుతో ఘాట్‌ను అభివృద్ధి చేసి, పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.





పుష్కరాల నాటికి ఘాట్‌ను ఏ విధంగా తీర్చిదిద్దాలనీ అనుకుంటున్నామో అదే నమూనాను ఈ నెల 22న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు చూపించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పరిపాలనా అనుమతులు పొందిన అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని, అనంతరం పనుల పురోగతిని స్వయంగా పరిశీలించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.

ఘాట్‌కు వచ్చే ప్రధాన మార్గాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, గ్రామంలో వ్యక్తిగత, సామూహిక సోక్‌పిట్లు, మ్యాజిక్ ట్రెంచ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మునికూడలి ఘాట్ చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతను ప్రతిబింబించేలా పర్యాటక, దేవాదాయ శాఖలు సమాచార బోర్డులు, దిశానిర్దేశక సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు . పుష్కరాల సందర్భంగా భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, స్నాన సదుపాయాలు కల్పించడంతో పాటు ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మునికూడలి ఘాట్‌ను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన పుష్కర ఘాట్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు.జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, అన్ని శాఖలతో సమన్వయంతో పర్యటనను విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, ఘాట్ పరిసరాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, వ్యర్థాల నిర్వహణ, సైన్‌బోర్డులు, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, పుష్కర్ డిప్యూటీ కలెక్టర్లు మహేష్, మనోజ్, ఆర్డీవో ఆర్. శివ రాముడు, జిల్లా రవాణా శాఖ అధికారిఆర్ సురేష్, తాసిల్దార్ అంకం శ్రీనివాస్ మండల స్థాయి అధికారులు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, గ్రామీణ నీటి సరఫరా, పర్యాటక, దేవాదాయ శాఖల అధికారులు, గ్రామ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవీ అమ్మవారికి వెండి కిరీటం సమర్పించిన డాక్టర్ కంచర్ల బాబీ దంపతులు






**కడియం, పెన్ పవర్, జూన్ 18:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం దివ్య విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 11:14 గంటలకు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ప్రతిష్ఠా కార్యక్రమంలో భక్తులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు డాక్టర్ కంచర్ల బాబీ, శ్రీదేవి దంపతులు అమ్మవారికి సుమారు రూ.3 లక్షల విలువైన వెండి కిరీటాన్ని ఆలయ కమిటీకి సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కంచర్ల బాబీ మాట్లాడుతూ జగన్మాత శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సేవా భావం పెంపొందాలని కోరారు. ప్రతిష్ఠా మహోత్సవం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 10 వేల మందికి పైగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో కడియం మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు గ్రంధి నాగబాబు, జిల్లా అదనపు కార్యదర్శి వారణాశి శ్రీనివాస గుప్త, మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీతా మహాలక్ష్మి, గ్రంధి సుజాత, సిగంశెట్టి కుమార్, పసలపూడి కుమార్, తమ్మన సత్తిబాబు, కంచర్ల మూర్తి, గ్రంధి నానబ్బులు, కంచర్ల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## శరభవరంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

గిరిజన గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ





**గంగవరం, పెన్ పవర్, జూన్ 18 :** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం మోహనాపురం పంచాయతీ పరిధిలోని శరభవరం గ్రామంలో గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేని గ్రామీణ ప్రజలకు వారి గ్రామాల్లోనే చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గంగవరం మండలంలో ఈ నెలలో మొత్తం ఏడు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించినట్లు వెల్లడించారు. అందులో భాగంగా శరభవరం గ్రామంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొగ్గుల సత్తిబాబు, బుర్రే రాజా, ఏఎన్ఎం సిబ్బంది, డాక్టర్ నిఖిత్, జీఎన్ఎం చిట్టీ, ఫార్మసిస్ట్ స్వర్ణ, ఎన్టీఆర్ ట్రస్ట్ ప్రతినిధులు శ్రీకాంత్, కందుల సాయి, కుంజం రామకృష్ణ దొర, ట్రస్ట్ సిబ్బంది నాని, ఆశా వర్కర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 20న రంపచోడవరంలో భారీ యోగ కార్యక్రమం

ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూన్ 18 :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 20న రంపచోడవరంలో భారీ యోగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ఏపీఆర్జేసీ బాలుర పాఠశాల ప్రాంగణంలో యోగ కార్యక్రమ ఏర్పాట్లను ఆయన, రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె. స్వాతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 6 గంటల నుంచి ఏపీఆర్జేసీ బాలుర పాఠశాల మైదానంలో "ఇండిజినస్ వెల్‌నెస్ థీమాటిక్ -- ఆయుష్ మేధ" అంశంపై యోగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పోలవరం జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాల ద్వారా ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. యోగ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమ ఏర్పాట్ల పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఏపీఓ (జనరల్) డీఎన్వీ రమణ, ఏవో ఎర్రంశెట్టి రాజు, ఏపీఆర్జేసీ ప్రిన్సిపాల్ ఎలిషా, ఆయుష్ వైద్యాధికారులు చైతన్య, మనోహర్, సర్వేయర్లు ఎం. లక్ష్మణ్, సురేష్, సాగర్, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవం కార్యక్రమాల లో మండల స్థాయి అధికారులు....




**అడ్డతీగల, పెన్ పవర్,జూన్ 18:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 2026 జూన్ 7 నుండి 21 వ తారీఖు వరకు అన్ని గ్రామాలలో మరియు మండల కేంద్రంలో యోగా దినోత్సవం జరుపవలసినదిగా ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా గురువారం అడ్డతీగల మండలం తిమ్మాపురం శివాలయం వద్ద మండల స్థాయి అధికారులు మరియు గ్రామ సచివాలయ సిబ్బంది, మరియు గ్రామస్తు లు ఈ యోగా కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అడ్డతీగల ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్ మాట్లాడుతూ యోగా వలన ప్రతి మనిషి పటిష్టంగా ఉంటాడని, శరీరములో మంచి మార్పులు వస్తాయి అని ఆరోగ్యకరంగా ప్రతి వ్యక్తి జీవిస్తాడని ప్రతి ఒక్కరు యోగాను దినచర్యగా ఆచరించాలని ఎంపీడీవో కుమార్ తెలిపారు. వారందరికీ యోగ ప్రాముఖ్యతను తెలియజేసి వారితో యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో (ఎం ఈ ఓ) సి .హెచ్ . శ్రీనివాస రావ్, ఎన్ ఆర్ జి ఎస్ ఏపీవో బి.చిరంజీవి రావ్, పి ఈ టి లు పి. శ్రీను, ఎన్. రాంబాబు, ఎం. నాగమణి పాల్గొన్నారు.

# ఉద్యానవన పంటల విస్తరణకు కార్యాచరణ రూపొందించాలి



**గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు**

**పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూన్ 18 :** పోలవరం జిల్లాలో ఉద్యానవన పంటల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తూ గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉద్యానవన శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో ఉద్యానవన పంటల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) రూపొందించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని గిరిజన రైతులకు పామాయిల్ సాగుతో పాటు ఎంఐడిహెచ్ పథకం కింద జీడిమామిడి, మామిడి, నిమ్మ, అరటి, పూలు, వివిధ రకాల కూరగాయల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులకు ఉద్యానవన మొక్కల పంపిణీ కోసం మండలాల వారీగా, గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశిస్తూ కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే గిరిజన రైతులకు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించి, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యానవన పంటల సాగు ద్వారా గిరిజన రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం కావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, పీహెచ్ఓ నరేంద్ర కుమార్, హార్టికల్చర్ అధికారి ముత్తయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

# భీమాపురం దొరసాని రెస్టారెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం . పెన్ పవర్. జూన్18:** మావుళ్ళమ్మ దేవస్థానం గుడి దగ్గర భీమాపురం దొరసాని నూతన రెస్టారెంట్ ను గురువారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. భీమవరం పట్టణం రోజురోజుకీ అభివృద్ధి చెందుతుందని, భీమాపురం దొరసాని లాంటి రెస్టారెంట్ల ఆవశ్యకత ఉందన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో భాగంగా వారంలో ఒక్కసారైనా కుటుంబంతో కలిసి రెస్టారెంట్ కు వస్తారని వారిని దృష్టిలో ఉంచుకొని మెరుగైన సేవలు కల్పించాలన్నారు. రెస్టారెంట్ నిర్వాహకులు బందారు మణికంఠ మాట్లాడుతూ ప్రజలకు అనుకూలంగా రుచికరమైన సౌత్ ఇండియన్ కిచెన్ ఐటమ్స్ అందిస్తున్నామన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ ప్రింట్ మీడియా కమిటీ చైర్మన్‌గా రవికుమార్ నియామకం



**అమరావతి, పెన్ పవర్, జూన్ 18:** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ప్రింట్ మీడియా కమిటీ చైర్మన్‌గా కలం కౌంటర్ దినపత్రిక అధినేత రవికుమార్‌ను నియమించినట్లు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఇల్లూరు లక్ష్మయ్య మాట్లాడుతూ రవికుమార్ మీడియా రంగంలో నిబద్ధతతో పనిచేస్తున్నారని, ఆయన అనుభవం, సేవలు మహాసభ బలోపేతానికి ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మహాసభ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేయాలని సూచించారు.

**కృతజ్ఞతలు తెలిపిన రవికుమార్**

ప్రింట్ మీడియా కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినందుకు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ చైర్మన్ టీజీ వెంకటేష్, రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య, మహాసభ బిల్డింగ్ కమిటీ చైర్మన్ పెనుగొండ సుబ్బరాయుడు, మహాసభ గౌరవాధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు తదితరులకు రవికుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మహాసభ ఆశయాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని రవికుమార్ పేర్కొన్నారు. ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతికి మీడియా వేదికగా తనవంతు సహకారం అందిస్తానని ఆయన స్పష్టం చేశారు.

## ఏజెన్సీలో విజృంభిస్తున్న మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు

జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకోవాలి: సీపీఎం డిమాండ్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూన్ 18 :** పోలవరం జిల్లా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు తీవ్రస్థాయిలో విజృంభిస్తున్నాయని, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని అత్యవసర చర్యలు చేపట్టాలని సీపీఎం పోలవరం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ప్రతి ఏడాది వర్షాకాలం ప్రారంభంలో జ్వరాలు పెరుగుతాయని తెలిసినా, ముందస్తు నివారణ చర్యలు చేపట్టడంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖతో పాటు క్షేత్రస్థాయి యంత్రాంగం పూర్తిగా విఫలమైందని సీపీఎం ఆరోపించింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏజెన్సీ ప్రాంత ప్రజలు, ముఖ్యంగా గిరిజన చిన్నారులు జ్వరాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారని పేర్కొంది. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, రోగులకు సరిపడా పడకలు లేక వరండాల్లో మంచాలు వేసి చికిత్స అందిస్తున్నారని తెలిపింది. 20 పడకలతో ఉన్న చిన్నారుల వార్డులో 45 మందికి పైగా పిల్లలు చికిత్స పొందుతున్నారని, రంపచోడవరం ప్రాంతంలోనే 40 మందికి పైగా చిన్నారులు మలేరియా బారిన పడినట్లు వెల్లడించింది. ఏజెన్సీ పరిధిలోని 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇప్పటివరకు 250 మలేరియా పాజిటివ్ కేసులు, ఏప్రిల్ నెల నుంచి 1,386 టైఫాయిడ్ కేసులు నమోదైనట్లు పేర్కొంది. అయితే క్షేత్రస్థాయిలో బాధితుల సంఖ్య అధికారిక లెక్కల కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని సీపీఎం అభిప్రాయపడింది. వై.రామవరం, మారేడుమిల్లి, అడ్డతీగల, చింతూరు, కూనవరం ప్రాంతాల ఆసుపత్రుల్లో వందలాది మంది జ్వరపీడితులు చికిత్స పొందుతున్నారని తెలిపింది. ఈ పరిస్థితుల దృష్ట్యా జిల్లా కలెక్టర్ స్వయంగా రంపచోడవరం ఏరియా ఆసుపత్రి, ఏజెన్సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించాలని సీపీఎం కోరింది. అలాగే ఆసుపత్రుల్లో అదనపు పడకలు ఏర్పాటు చేయడంతో పాటు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది కొరతను భర్తీ చేయాలని డిమాండ్ చేసింది. జ్వరాలు అధికంగా నమోదవుతున్న వై.రామవరం, మారేడుమిల్లి మండలాల గిరిజన గ్రామాల్లో ప్రత్యేక మొబైల్ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేయాలని సూచించింది. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్లలో మలేరియా, టైఫాయిడ్ మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర ఔషధాలను సమృద్ధిగా నిల్వ ఉంచాలని కోరింది. దోమల నివారణ కోసం ఏజెన్సీ గ్రామాల్లో ఫాగింగ్, మలాథియాన్ స్ప్రేయింగ్ కార్యక్రమాలను తక్షణమే చేపట్టి, గిరిజన కుటుంబాలకు ఉచితంగా నాణ్యమైన దోమతెరలను పంపిణీ చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఈ అత్యవసర సమస్యపై అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించాలని పార్టీ నాయకులు కోరారు.

# యూఎఫ్ఎస్ డేటా ధృవీకరణను గడువులోగా పూర్తి చేయాలి-జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 18:**తూర్పుగోదావరి జిల్లాలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే డేటా ధృవీకరణ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. జూన్ 18న జిల్లాలోని అన్ని స్వర్ణ గ్రామాలు, వార్డుల్లో యూఎఫ్ఎస్ సోషల్ ఆడిట్ డేటాను ప్రజల పరిశీలన కోసం ప్రదర్శించడం జరిగిందన్నారు. డేటాపై జూన్ 19న గ్రామ, వార్డు సభలు నిర్వహించి డేటా ధృవీకరణ చేపట్టాలని సూచించారు.


జూన్ 19 నుంచి 24 వరకు ప్రజలు తమ వివరాలకు సంబంధించిన అభ్యంతరాలు, ఫిర్యాదులను నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. అందిన అభ్యర్థనలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి డేటా ధృవీకరణను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ కుటుంబ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా స్వర్ణ గ్రామ/వార్డు అధికారిణి కె. రత్న కుమారి వివరాలు తెలియ చేస్తూ, గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా యూఎఫ్ఎస్ ధృవీకరణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు క్షేత్ర స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



# కోనసీమ తిరుమల వాడపల్లి దేవస్థానానికి రూ.2.44 కోట్ల హుండీ ఆదాయం

34 రోజుల్లో భక్తుల కానుకల వెల్లువ.. హుండీల్లో బంగారం, వెండి, విదేశీ కరెన్సీలు.







**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 18**:ఆత్రేయపురం మండలంలోని కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచేలా హుండీ ఆదాయం భారీగా నమోదైంది. గురువారం నిర్వహించిన హుండీ లెక్కింపులో గత 34 రోజుల కాలానికి సంబంధించిన మొత్తం రూ.2,44,37,050 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో పారదర్శకంగా ఈ ప్రక్రియ నిర్వహించారు..అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రధాన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం, శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీల ద్వారా రూ.1,77,70,227 నగదు లభించగా, అన్నప్రసాదం హుండీల ద్వారా మరో రూ.66,66,823 ఆదాయం వచ్చింది. దీంతో మొత్తం హుండీ ఆదాయం రూ.2.44 కోట్లకు చేరింది. స్వామివారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకోవడంతో ఈ స్థాయిలో ఆదాయం సమకూరినట్లు అధికారులు పేర్కొన్నారు. నగదు కానుకలతో పాటు హుండీలలో 52 గ్రాముల బంగారం, ఒక కిలో 588 గ్రాముల వెండి లభించాయి. అలాగే 18 దేశాలకు చెందిన 77 విదేశీ కరెన్సీ నోట్లు గుర్తించడం విశేషంగా నిలిచింది. విదేశాల్లో నివసిస్తున్న భక్తులు కూడా స్వామివారిపై ఉన్న అపార భక్తిశ్రద్ధలతో కానుకలను సమర్పిస్తున్నారని దేవస్థాన వర్గాలు తెలిపాయి.

హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.టి.పి.టి. శ్రీనివాస్, ఈఓ గ్రేడ్-3 బి. నరేంద్ర కుమార్, ఎం. సత్యనారాయణ, ఆలయ అధికారులు, వేదపండితులు, గ్రామస్థులు, శ్రీవారి సేవకులు, పోలీసు సిబ్బంది, కెనరా బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.భక్తుల నుంచి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణతో వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత ఖ్యాతిని సంతరించుకుంటోందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. భక్తుల విశ్వాసం, స్వామివారిపై ఉన్న అపార భక్తి హుండీ ఆదాయంలో ప్రతిఫలిస్తోందని వారు అభిప్రాయపడ్డారు.

# మృతిచెందిన మేకలకు నష్టపరిహారం చెల్లించాలి: -మండలఎంపీపీ కారం లక్ష్మి.



**వి.ఆర్.పురం పెన్.పవర్.జూన్.18**
బుధవారం ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షం,కారణంగా పిడుగుపడి మృతి చెందిన మేకల పెంపకందారులకు,తక్షణమే,మేకలకు నష్టపరిహారం చెల్లించాలని,మండలఎంపీపీ కారం లక్ష్మి,ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రమాదానికి గురైమేకలు మృతి చెందిన ప్రాంతాన్ని సందర్శించి,మేకలుపెంపకందారులతోమాట్లాడారు.పిడుగు హటాత్తుగా పడడంతో,పేద గిరిజనుల రైతులమేకలుమృతిచెందడంతో తమకు జీవనాధారమైన మేకలను కోల్పోవడం జరిగిందని,పూర్తిగా నష్టపోయారని, రెక్కాడితే గాని డొక్కాడని గిరిజన,నిరుపేద కుటుంబాలు పశు పోషణనే,ఆధారంగానమ్ముకుని జీవిస్తున్నారని,ఊ హించని ప్రకృతి విపత్తుల,కారణంగా భారీవర్షం రావడంమేకలుమృతిచెందడంతో,పెంపకందారులు కుటుంబాలు,రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని,ఆవేదన వ్యక్తం చేశారు.పశు సంవర్ధకశాఖ,రెవెన్యూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి,నష్టపోయిన జీవాల వివరాలను సేకరించాలని,కోరారు.మృతిచెందిన ప్రతి మేకకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన నష్ట పరి హారాన్ని త్వరితగతిన లబ్ధిదారులకు వచ్చే విధంగా ప్రభుత్వ అధికారులు చొరవ చూపాలని,అన్నారు.సర్వం కోల్పోయి,అధైర్య పడుతున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచి,భరోసా కల్పించాలని,కోరారు.అనంతరం కారం మారయ్య కారం సీతా రామయ్య,కారం సీతయ్య,ఉయికలక్ష్మయ్య,సరియం లక్ష్మయ్య ఉయిక చిన్నమ్మి కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం వచ్చే విధంగా ప్రయత్నం చేద్దామని,భరోసా ఇచ్చారు.

## నేడు ప్రత్తిపాడులో "వన్ మంత్ -వన్ విలేజ్ -ఫోర్ విజిట్స్" కార్యక్రమం.

-ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయంలో నేరుగా అర్జీలు స్వీకరించనున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూన్ 18:**ఒక నెల,ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రత్తిపాడు మండలం ఎంపీడీవో కార్యాలయంలో వరుసగా రెండవ వారం ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక నెల, ఒక గ్రామం,నాలుగు సందర్శనలు" కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతి శుక్రవారం నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమానికి డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ఉదయం 9:30 నిమిషాలకే ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయానికి విధిగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# జూలై 11న జాతీయ లోక్ అదాలత్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 18:**జూలై 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసి, అధిక సంఖ్యలో కేసులను రాజీ ద్వారా పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం, తగిన పరిహారం అందించేలా అన్ని ఇన్సూరెన్స్ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత సూచించారు. గురువారం ఈ మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి యార్లగడ్డ ఆధ్వర్యంలో వివిధ ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు, ఆయా సంస్థల న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జూలై 11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో కేసులను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా మోటారు ప్రమాద పరిహారం, సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులతో పాటు రాజీకి అనుకూలమైన ఇతర కేసులను గుర్తించి వాటి జాబితాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు త్వరితగతిన అందజేయాలని సూచించారు. అలాగే రాజీ ద్వారా పరిష్కరించదగిన అన్ని కేసులను ముందుగానే గుర్తించి, సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకుని జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారానికి ఇది సమర్థవంతమైన వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు


### జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ శిరీష




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 18:**తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమండ్రి అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో జూన్ 20వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిహెచ్.శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ అమెజాన్, నవతా, బ్యాంక్ అఫ్ బరోడా, ఎస్ బి ఐ పేమెంట్, ఫ్లిప్కార్ట్ కంపెనీలలో పలు పోస్టల భర్తీకొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడనున్నాయని జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. ఎస్ఎస్సి, ఇంటర్, ఐ టీ ఐ, ఏదైనా డిగ్రీ, పిజీ పూర్తి చేసి అనుభవం ఉన్న లేదా ఆసక్తి గల 19 నుండి 30 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా వఎజూశ్రీశీఎఎవత్.ఖజూ.స్త్రశీజ.అఅ లింక్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, రెజ్యూమే, ఆధార్, సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ శిరీష తెలిపారు.

# నాణ్యతా ప్రమాణాలు పాటించని రహదారి నిర్మాణం - నిర్మాణం లోనే రహదారికి గండి





**వై రామవరం, పెన్ పవర్, జూన్ 18 :** రహదారి నిర్మాణం ప్రారంభించి రెండు నెలలు కావస్తున్నా నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని బుధవారం కురిసిన వర్షానికి గండిపడడమే దీనికి కారణమని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పులుసు మామిడి నుండి ములగలపూడి వరకు రహదారి నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. కానీ రహదారి ప్రక్కనున్న మట్టిని పోస్తూ బురదమయంగా చేశారని, ఈ రహదారిపై కనీసం మోటర్ సైకిల్ వెళ్లడానికి కూడా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు. ఈ రహదారిలో మూడు చోట్ల కల్వర్టులు కట్టవలసి ఉండగా నిర్మించలేదని తెలిపారు. కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కై నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఇంజనీరింగ్ అధికారులు స్పందించి నాణ్యతా ప్రమాణాలతో రహదారి నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరుచున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

